క్లుప్తంగా

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన



జి.కొండూరు: గ్రామ వలంటీరు విధులతో పాటు అదనపు విధులను అప్పగించి ఇంటింటికీ తిప్పుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దిగజార్చే విధంగా అధికార వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఉద్యోగులు మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు మండల పరిధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను బహిష్కరించారు. వలంటీరు విధుల నుంచి తమను తప్పించి పని భారాన్ని తగ్గించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డెప్యూటీ ఎంపీడీఓ బసవలింగేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు.

దోమల నివారణ మందు ఫాగింగ్

చాట్రాయి: చాట్రాయి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో దోమల మందు ఫాగింగ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విజిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపిక



మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. రాముడు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్‌ఎస్‌ఏ) విజిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్లాంట్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్‌లో ఒక నెల కొలాబరేటివ్‌గా రీసెర్చ్ వర్క్‌కు అనుమతి పొందారని వివరించారు. రాముడును ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, కామర్స్ విభాగాధిపతి ఎం. శ్రీనివాసరావు, వి. ఉమాలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి యూరియా పంపిణీ

జి.కొండూరు: మండల పరిధిలోని నాలుగు పీఏసీఎస్‌లు, మూడు ప్రయివేటు ఎరువుల దుకాణాలలో 95టన్నుల యూరియా శనివారం నుంచి పంపిణీకి సిద్ధంగా ఉందని మండల వ్యవసాయాధికారి కేసీహెచ్ సూరిబాబు ఒక ప్రకటనలో అన్నారు. వెలగలేరు సహకార సొసైటీలో 20 టన్నులు, కవులూరు సహకార సొసైటీలో 30 టన్నులు, చెవుటూరు సహకార సొసైటీలో 10 టన్నులు, వెల్లటూరు సహకార సొసైటీలో 15 టన్నులు, కోడూరులో రెండు, వెలగలేరులో ఒక ప్రైవేటు ఎరువుల దుకాణంలో 20 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



మైలవరం: నేటి రాజకీయ పరిస్థితుల్లో సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు అన్నారు. సీపీఎం అగ్రనేత దివంగత సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి వారోత్సవాలు మైలవరం సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. దీనితో భాగంగా శనివారం సదస్సు నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ సీతారాం ఏచూరిని స్ఫూర్తిగా తీసుకుని వీటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావూరి రమేష్‌బాబు, ఎస్.ఇసాక్, ఆర్. సుబ్బారావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

వీరులపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డెప్యూటీ ఎంపీడీవో శేఖర్ పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పొన్నవరం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వైద్యాధికారి అన్వేష్ మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి శనివారం ఒక గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వరం, బీపీ, షుగర్ టెస్టులు చేసి వైద్య సేవలందిస్తామన్నారు.

కప్పలవాగు.. కనుమరుగు!

- ఆక్రమణలతో పూడ్చేసిన వైనం
- దిశ మార్చుకుని ప్రవహిస్తున్న వరద
- కోతకు గురవుతున్న తారకరామా ఎత్తిపోతల పథకం కుడి కాలువ



జి.కొండూరు శివారులో 30 నంబరు జాతీయ రహదారి పక్కన ఆక్రమణకు గురై కొద్ది దూరం మాత్రమే కనిపిస్తున్న కప్పలవాగు



కప్పలవాగు వరద ప్రవాహంతో కోతకు గురైన తారకరామా కుడి కాలువ

జి.కొండూరు: మానవ తప్పిదాలే ప్రకృతి వైపరీత్యాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. వాగులు, కాలువలను ఆక్రమించడం వల్ల ప్రకృతి ప్రకోపానికి అమాయక ప్రజలు బలికాక తప్పడంలేదు. ఆక్రమణలతో వరద ప్రవాహం దిశ మార్చుకుని ప్రవహించి జనావాసాల మీదకు రావడంతో ముంపు బారిన పడక తప్పడం లేదు. జి.కొండూరు శివారులోని కప్పలవాగు ఆక్రమణే ఇందుకు నిదర్శనం. కొంతమంది రైతులు, రియల్టర్ల అత్యాశతో కప్పలవాగు కనుమరుగై వరద ప్రవాహం దిశమార్చుకొని ప్రవహించడంతో సమీప రైతులకు తిప్పలు తప్పడం లేదు.

ఐదు కిలోమీటర్ల మేర..

జి.కొండూరు మండల పరిధిలోని గడ్డమణుగు లోయ ప్రాంతంలో కొండల్లో సహజసిద్ధంగా పుట్టిన కప్పలవాగు ఐదు కిలోమీటర్ల మేర ప్రవహించి పినపాక గంగాదేవి చెరువులో కలుస్తుంది. ఈ వాగు 10 మీటర్ల మేర వెడల్పు ఉండేదని తెలుస్తోంది. ప్రస్తుతం జి.కొండూరు శివారులోని 30వ నంబర్ జాతీయ రహదారి కోసం ఈ వాగుపై నిర్మించిన చప్టా వద్ద రెండు వైపులా వంద మీటర్ల వరకు మాత్రమే ఈ కాలువ కనిపిస్తోంది. మిగిలిన కాలువ మొత్తం ప్రారంభం నుంచి చివరి వరకు దానికి ఆనుకొని ఉన్న రైతులు ఆక్రమించి తమ భూములలో కలిపేసుకోవడంతో కప్పలవాగు కనుమరుగైపోయింది. అంతే కాకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లను సైతం ఈ వాగును పూడ్చి ఏర్పాటు చేసి విక్రయాలు జరపడంతో వాగు ఎక్కడుందో అధికారులు కూడా కనిపెట్టలేని దుస్థితి ఏర్పడింది. అధికారులు ఇకనైనా స్పందించి కప్పలవాగుని సర్వే చేసి రైతులు, రియల్టర్ల నుంచి విడిపించకపోతే కొంత కాలం తర్వాత కప్పలవాగు అనేది రికార్డుల్లో తప్ప భూమిపై కనిపించే అవకాశం లేదు.

తారకరామా కాలువపై ప్రభావం..

ఇటీవల కురిసిన భారీ వర్షానికి కప్పలవాగు ఉద్ధృతంగా ప్రవహించింది. దీంతో వాగుని రైతులు ఆక్రమించి పూడ్చడంతో వాగు దిశ మార్చుకొని పక్కనే ఉన్న తారకరామా ఎత్తిపోతల పథకం కుడి కాలువ వైపు మళ్లింది. పినపాక గ్రామ శివారులో ఉన్న తారకరామా ఎత్తిపోతల పథకం నాలుగో పంపుహౌస్ వద్ద కుడి కాలువలోకి మళ్లిన కప్పలవాగు వరద ఉద్ధృతి, మూడో పంపుహౌస్ వద్దకు చేరి విధ్వంసం సృష్టించింది. వరద ప్రవాహంతో మూడో పంపుహౌస్ వద్ద రెండు వైపులా కట్టలు కోతకు గురయ్యాయి. నిత్యం ఇదే తంతు కొనసాగుతుండడంతో పంపుహౌస్ నిర్వహణ సమస్యగా మారింది. అంతే కాకుండా సమీప రైతుల వ్యవసాయ భూముల మీదుగా ప్రవహించడంతో పత్తి పైరు ముంపునకు గురైంది.

చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు..

కప్పలవాగు దిశమార్చుకొని ప్రవహించడం వల్ల తారకరామా ఎత్తిపోతల పథకం మూడో పంపుహౌస్ వద్ద కాలువ కట్టలు కోతకు గురవుతున్న క్రమంలో ఇరిగేషన్ అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. కప్పలవాగు ఆక్రమణలు తొలగించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులకు అర్జీ ఇస్తామని తారకరామా అధికారులు 'సాక్షి'తో చెప్పారు. అంతే కాకుండా వరద తారకరామా కాలువలోకి రాకుండా ఉండేలా చర్యలు చేపడతామని వివరించారు.

వరదంతా గ్రామాల మీద పడుతుంది..



కప్పలవాగు దాదాపుగా మొత్తం పూడ్చేశారు. అక్రమ కట్టడాలను సైతం నిర్మించారు. భారీగా వర్షాలు పడినప్పుడు వరద ప్రవాహం భయాందోళన కలిగిస్తోంది. వరద ప్రవాహం దిశ మార్చుకొని ప్రవహిస్తే అటు పినపాక, ఇటు జి.కొండూరు గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కప్పలవాగు ఆక్రమణలను తొలగించి సహజ సిద్ధంగా ఏర్పడిన వాగుని సంరక్షించాలి.

– బట్టపర్తి రాజు, గ్రామస్తుడు, జి.కొండూరు

ఎరువుల నిల్వలో వ్యత్యాసం.. కేసు నమోదు



నూజివీడు ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నూజివీడు: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖాధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాంతీయ విజిలెన్స్ అధికారి పి. మహేష్ నేతృత్వంలో నూజివీడులోని విజయసాయి ట్రేడర్స్‌ను తనిఖీ చేయగా అందులో రూ.1.14 లక్షల విలువ గలిగిన 4.650 టన్నుల కాంప్లెక్స్ ఎరువుల నిల్వలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి షాపును సీజ్ చేసి యజమానిపై కేసును నమోదు చేశారు. లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించగా ఫారం ఓ సక్రమంగా లేనందున దుకాణంలోని 17.75 టన్నుల ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ జి. వీరయ్య, ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, నూజివీడు ఏఓ పలగాని చెన్నారావు పాల్గొన్నారు.

ఈదరలో సొసైటీ తనిఖీ..

ఆగిరిపల్లి: ఈదరలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కేంద్రాన్ని శనివారం ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సహకార సంఘంలోని యూరియా నిల్వలను, రికార్డులను పరిశీలించారు. సహకార సంఘం వద్ద రైతులు క్యూలో నిలబడి ఉండటం చూసి రైతులకు కుర్చీలు ఏర్పాటు చేయమని సిబ్బందికి ఆదేశించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వినాయక నిమజ్జనాలు



గంపలగూడెంలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

చాట్రాయి: గణపతి నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావుపాలెం, చనుబండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గ్రామంలో ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

విస్సన్నపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం శనివారం జరిగింది. ఊరేగింపులో బేతాళ నృత్యం ఆకర్షణగా నిలిచింది. ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

తిరువూరు: తిరువూరు లక్ష్మీగణపతి ఆలయం, కుమ్మరిబజారు వినాయకుడి దేవస్థానం, షిర్డీ సాయి మందిరం, చీరాల సెంటర్, లక్ష్మీ సెంటర్, గణేష్ సెంటర్, రాజుపేట, పాత తిరువూరు, శాంతినగర్, వైష్ణవ బజారులలోని నవరాత్రి పందిళ్లలో విగ్రహాలను పట్టణంలో ఊరేగించి కట్టలేరులో నిమజ్జనం చేశారు. గంపలగూడెంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవ పందిళ్లలో వినాయక విగ్రహాలను వాగుల్లో నిమజ్జనం చేశారు. ఎ.కొండూరులో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి సిద్ది వినాయక ఆలయంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం నిమజ్జనం కోలాహలంగా సాగింది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చిట్టిబాబు, శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే బాలికలకు భవిష్యత్తు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి



నూజివీడు: ఆడపిల్లలను చదివించి వారి సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. ధనలక్ష్మి అన్నారు. మద్దాయికుంట హైస్కూల్‌లో శనివారం కిశోర వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల నిరోధం వంటి పన్నెండు అంశాల్లో బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. హైస్కూల్ హెచ్‌ఎం దారపురెడ్డి భాస్కరరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాగు నీరు వృథా



చాట్రాయి: వృథాగా పోతున్న తాగు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణారావుపాలెం గ్రామంలోని తాగు నీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకు పైపు పగలడంతో పైపు లైన్ ద్వారా గృహాలకు తగినంత తాగు నీరు పంపిణీ కావడంలేదు. అరకొరగా వస్తున్న తాగు నీరు సరిపోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ వారు పగిలిన పైపులైన్‌కి మరమ్మతులు చేసి తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భీమేశ్వర కాలనీలో వెలుగు చూసిన బాణసంచా



జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి భీమేశ్వర కాలనీలో ఈనెల 2న ఓ ఇంట్లో జరిగిన బ్లాస్టింగ్ అనంతరం అనేక విషయాలు వెలుగు చూస్తున్నాయి. కాలనీలోని వివిధ ప్రాంతాల్లో బాణసంచా తయారీకి వినియోగించే పదార్థాలు, తయారు చేసిన బాణసంచా వస్తువులను స్థానికులు శనివారం సాయంత్రం గుర్తించారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయగా అక్కడికి చేరుకున్న పోలీసులు బాణసంచాకు వినియోగించే లిక్విడ్, సూర్యకారం, తయారు చేసిన ఉల్లిపాయ బాంబులు స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో నుంచి బయటకు అడుగు వేయాలంటే భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియడం లేదని, పిల్లలు తిరిగే ప్రాంతాల్లో పేలుడు పదార్థాలు పడేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

12న మండల పరిషత్ సమావేశం

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

తిరువూరురూరల్: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ రవిబాబు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు శోభనాచలుని ఆలయం మూసివేత

ఆగిరిపల్లి: సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ తలుపులను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూసివేస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంతం శేషుబాబు తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తామని చెప్పారు.

బ్యాంకర్లతో సమావేశం

నూజివీడు: మండల స్థాయి బ్యాంకర్ల సంయుక్త కమిటీ సమావేశం నూజివీడు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం లీడ్ బ్యాంక్ మేనేజర్ డి. నీలాద్రి అధ్యక్షతన జరిగింది. జూన్ 30, 2025 నాటికి వార్షిక క్రెడిట్ ప్లాన్ అమలు, వ్యవసాయ, ఇతర ప్రాధాన్యతారంగ రుణాల కింద పనితీరు సమీక్ష, కౌలు రైతులకు, సీసీఆర్‌సీ కార్డుదారులకు రుణాలు ఇవ్వడం, ప్రధానమంత్రి సూర్య ఘర్ రుణాల సమీక్ష, స్వయం సహాయక సంఘాలకు రుణ ప్రతిపాదనల కోసం సెర్ప్ పోర్టల్‌లో సూక్ష్మ క్రెడిట్ ప్రణాళికల కింద పనితీరుపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఇండెంట్

నూజివీడు: మండలంలోని రైతుల అవసరార్థం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ ఆరో తేదీ వరకు 897 మెట్రిక్ టన్నుల యూరియాను డీలర్లకు సరఫరా చేశామని వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు అన్నారు. శనివారం నాటికి మండలంలో సొసైటీలు, ప్రైవేటు దుకాణాల ద్వారా 32 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మరో 60 మెట్రిక్ టన్నుల యూరియా కోసం మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పెట్టామని చెప్పారు.

మహిళల భద్రతపై కార్యాచరణ ప్రకటించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళల భద్రత, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం కొండపల్లిలో జరిగింది. ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబన, సాధికారితకు చర్యలు చేపట్టాలని, ఇళ్లు లేని మహిళలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విచ్చలిడిగా మద్యం షాపులు ఏర్పాటు వలన మహిళలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం కొండపల్లి ఐద్వా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బేబీ సరోజిని, ప్రధాన కార్యదర్శిగా లింగాల పార్వతి, కోశాధికారిగా బి.రామసీత, ఉపాధ్యక్షురాలిగా నవీన, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే ఆహిషా, మరో ఆరుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సైబర్ నేరాల నిరోధంపై అవగాహన

నూజివీడు: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నిరోధంపై అవగాహన కార్యక్రమం టీటీడీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. డీఎస్పీ ఏవీవీఎన్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్ల ఆధారంగా సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, లింక్‌లు తెరవకూడదని, ఎవరికీ ఓటీపీలు చెప్పకూడదని, డిజిటల్ అరెస్టులను నమ్మవద్దన్నారు. ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎస్‌బీఐ డీఎండీ సత్యేంద్రకుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రజకులపై దాడి హేయం

మైలవరం: రజకులపై దాడి హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు బి. వెంకట్రావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో అరసవల్లి మార్తమ్మ అనే మహిళపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మల్లెల రాధాకృష్ణ, కొండపల్లి రామకృష్ణ, నాగవరపు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత లక్ష్యాలు సాధించాలి

మైలవరం: యువత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ప్రముఖ సైకాలజిస్ట్, కౌన్సెలింగ్ నిపుణులు ఫాజియా తరన్నుమ్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫిక్కీ ఫ్లో సంయుక్తంగా శనివారం నిర్వహించిన సదస్సులో ఫాజియా మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుంటూ విలువలతో కూడిన ప్రవర్తనను అలవర్చుకోవడం ద్వారా జీవిత ప్రయాణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చుకోవాలన్నారు. కళాశాల ఆంగ్ల అధ్యాపకులు బి. సుభాషిణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడారు.

పంట కాలువలోకి దూసుకువెళ్లిన కారు

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వెళుతున్న కారు స్థానిక కేరళ హోటల్ సెంటర్‌లో 65వ నంబర్ జాతీయ రహదారిపై అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. జేసీబీ సాయంతో కారును రోడ్డుపైకి చేర్చారు.

వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు తనిఖీ

చాట్రాయి: యూరియాను అక్రమంగా నిల్వ ఉంచినా, ఇతర ప్రాంతాలకు తరలించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా హెచ్చరించారు. చనుబండ గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టుని శనివారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. తెలంగాణలో యూరియా కొరత ఉండడంతో అక్రమంగా తరలకుండా చెక్‌పోస్టు వద్ద గట్టి నిఘా పెడుతున్నామని చెప్పారు. అనంతరం నరసింహారావుపాలెం సొసైటీలో ఎరువుల స్టాకుని పరిశీలించి త్వరితగతిన రైతులకు అందజేయాలన్నారు.

ఎరువుల షాపు తనిఖీ

చాట్రాయి: స్థానిక గ్రోమోర్ ఎరువుల షాపుని తహసీల్దార్ భద్రూ శనివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వరి సాగుకు సరిపడినంత యూరియాను మాత్రమే వాడుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ అధికారి బి. శివశంకర్, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

నూజివీడు: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని అన్నవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంను ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు.

బాలికలు, మహిళలు జట్టుగా ఏర్పడాలి

ముసునూరు: మహిళలు, బాలికలు తమ పని ప్రదేశాల్లో అనర్థాలు, అకృత్యాలు, అత్యాచారాలను నిరోధించేందుకు జట్లుగా ఏర్పడాలని నూజివీడు ఐసీడీఎస్ సీడీపీఓ విజయకుమారి పేర్కొన్నారు. కాట్రేనిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళలు పని ప్రదేశాల్లో ముగ్గురి నుంచి 20 మంది వరకు సభ్యులుగా ఉండేలా జట్టును ఏర్పాటు చేసి లీడర్‌ను నియమించాలన్నారు. ప్రతి చోటా ఇలా జట్టుగా ఏర్పడి అత్యాచారాల నిరోధానికి సంకల్పించాలని సూచించారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులను అవమానిస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



అన్నదాత పోరు పోస్టరు ఆవిష్కరిస్తున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోకపోగా వారిని అవమానిస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. ఈ నెల 9న చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టరును శనివారం తిరువూరులో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఎప్పటికి ఎరువుల సరఫరా జరుగుతుందో కూడా అధికారులు చెప్పలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు రైతులను అవమానకరంగా మాట్లాడటం శోచనీయమని, రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని చెప్పారు. రైతుల తరఫున వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తామన్నారు. రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ, మండల అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, తాళ్లూరి నవీన్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి అత్తునూరి వెంకట శివారెడ్డి, కార్యదర్శి ఎం. సీతారామయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాలసాని గోపాల నాగేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, నాయకులు తిరుమలశెట్టి వేణు, గుమ్మా పాపారావు, గుంటూరు మస్తాన్, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.